# అందం



ఆంధ్రభూమి వీక్లీ.. 17 జనవరి, 2002

"హలో రాఘవగారూ రండి. మీ ఆఫీస్ దగ్గర డ్రాప్ చేస్తాను. ఈరోజు ఆర్టీసీ బస్సులు స్ట్రైక్. వాళ్ళకు సపోర్టుగా ఆటోవాళ్ళు కూడా స్ట్రైక్ చేస్తున్నారు."

– వీధిలో నిలబడివున్న రాఘవ, శారద ముందు బైక్ ఆపుతూ అన్నాడు పవన్.

"నేను నడచి వెళ్లిపోతాను. దగ్గరేగా మా ఆఫీస్! శారదకు కోఠీలోని ఉమెన్స్ కాలేజీలో సర్వీస్ కమీషన్ ఎగ్జామ్ ఉంది. ఎలా పంపాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు రాఘవ.

"అయితే ఒక పని చేయండి. మీరు బైక్‌లో వెళ్లి శారదగారిని డ్రాప్ చేసి రండి. నేను మా ఇంట్లో ఉంటాను."

"నాకు డ్రైవింగ్ రాదండీ. మోపెడ్ అయితే డ్రైవ్ చెయ్యగలను. మీరు అటువైపే వెళ్లే పక్షంలో శారదను డ్రాప్ చేయండి. అదీ మీకు ఇబ్బంది లేకుంటేనే!"

"భలేవారే! ఇందులో ఇబ్బందేముంది... రండి!"

పవన్ వెనుక కూర్చుని వెళ్తున్న శారదకు ఎంతో సంతోషంగా ఉంది. రోజూ పవన్ ఆఫీసుకి బయలుదేరే సమయంలో బయట నుంచుని చూడటం ఆమెకు అలవాటు. ఎఱ్ఱగా, పొడుగ్గా, సినిమా హీరోలా ఉండే పవన్ వెనుక కూర్చుని బైక్‌పై వెళ్లినట్లు ఊహించుకునేది. అది ఇంత త్వరగా నిజమవుతుందని అనుకోలేదు.

"శారదగారూ... ఇదేనా మీరు ఎగ్జామ్ రాయబోయే సెంటరు?"

ఉలిక్కిపడి, "ఆఁ... అవును!" అంది బైక్ దిగుతూ.

"మనం వచ్చి అరవై సెకండ్లయినా మీరు దిగకపోయేసరికి అనుమానం వచ్చింది."

"సారీ..." సిగ్గుపడుతూ అంది.

"ఎన్ని గంటలకు అయిపోతుంది మీ ఎగ్జామ్?"

"సాయంత్రం నాలుగవుతుంది."

"మరి... లంచ్?"

చేతిలో ఉన్న లంచ్ బాక్స్‌ని చూపించింది.

"పర్వాలేదు... మీకు ముందుజాగ్రత్త ఎక్కువే! నేను నాలుగు గంటలకు వస్తాను. మీరు ఇదేచోట ఉండండి."

"ఎందుకండీ... ఐదు గంటల నుండి బస్సులు నడుస్తాయట. నేను బస్సులో వెళ్లిపోతాను."

"పరీక్ష రాసి బాగా అలసిపోయి ఉంటారు. ఆ రష్‌లో ఎలా వెళ్తారు? ఎటూ నేనూ ఇంటికి రావాలిగా! కాస్త ముందుగా బయలుదేరుతాను... అంతే! పరీక్ష బాగా రాయండి. నాలుగు గంటలకు మళ్లీ కలుద్దాం!" అంటూ వెళ్లిపోయాడు.

పరీక్ష అయ్యాక శారద పవన్ చెప్పినచోటే నిలబడి అతని కోసం ఎదురుచూడసాగింది. సరిగ్గా నాలుగు గంటలకు పవన్ వచ్చాడు.

"ఎలా రాశారు?"

"పర్వాలేదు."

"మీరు తప్పకుండా పాసవుతారు!"

"అలా అని ఎలా చెప్పగలరు?"

"అందమైన ఆడవాళ్ళకు తెలివితేటలు కూడా ఎక్కువగా ఉంటాయని నా అభిప్రాయం. రండి... కూర్చోండి!"

• • •

బైక్‌ని ఒక హోటల్ ముందు నిలిపాడు.

"ఇక్కడెందుకు ఆపారు?"

"ఎప్పుడో మధ్యాహ్నం తిన్నారు. అదీ అంత చిన్నబాక్స్‌లో పట్టేంత తిన్నారు. ఓ కప్పు కాఫీ త్రాగి వెళ్దాం... రండి!"

శారదకి తలనొప్పిగా ఉండటంతో కాఫీ తాగాలనే అన్పించింది.

మౌనంగా అతన్ని అనుసరించింది.

టిఫిన్ ఆర్డర్ చేసి శారదతో "మీరూ, రాఘవగారు పెళ్ళికి ముందే బంధువులా?" అన్నాడు.

"లేదే... ఎందుకలా అడిగారు?"

"మీరు ఆయన్ని చేసుకున్నారంటే మేనరికమేమో అనుకున్నాను."

శారద ఏం మాట్లాడలేదు.

కాఫీ త్రాగాక బిల్లు చెల్లించి అన్నాడు-

"ఈరోజు చాలా మంచిరోజు!"

ఎందుకన్నట్టు చూసింది.

"మీకు లిఫ్ట్ ఇచ్చే భాగ్యం, మీతో కలిసి కాఫీ తాగే అదృష్టం కలగటం వల్ల! నా డైరీలో రాసుకోదగ్గర రోజిది!"

"కొంపదీసి నిజంగానే రాసేరు! సునందగారు చూశారంటే మీ పని అంతే!" ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంటికి వచ్చేసరికి రాఘవ ఆఫీసు నుంచి వచ్చివున్నాడు. శారదను చూడగానే-

"ఏం శారదా... పరీక్ష బాగా వ్రాశావా? వచ్చేటప్పుడు ఎలా వచ్చావు?" అని అడిగాడు.

"పర్వాలేదు..." అని మాత్రం చెప్పింది.

రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసినట్లు- పవన్‌ని చూసిన కళ్ళతో రాఘవను చూడలేకపోతోంది. నల్లగా, సన్నగా ఉండే రాఘవను పెళ్ళిచేసుకోవడం తనకిష్టం లేదని ఎంత మొత్తుకున్నా తన తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడని, ఇంతకంటే మంచిసంబంధం తాము తేలేమని, రాఘవ మంచివాడని, అందం శాశ్వతం కాదని, 'అసలు మగాడికి అందం ఏమి'టని నచ్చజెప్పి రాఘవను తనకు కట్టబెట్టారు. పెళ్ళైనతర్వాత ఎలాగో రాజీపడింది. నిజానికి రాఘవ చాలా మంచివాడు. తనకు వంటపనుల్లో, ఇంటిపనుల్లో ఎంతో సహాయం చేస్తాడు. తానేమడిగినా కొనిస్తాడు. ఆఫీసులో, ఊర్లో మంచివాడన్న పేరు సంపాదించుకున్నాడు. పెళ్ళై రెండేళ్లైనా ఇంకా పిల్లలు లేరన్న లోటు తప్పితే తనకింకే సమస్యలూ లేవు. జీవితం సాఫీగా గడచిపోతూంటే ఇన్నాళ్లకు మళ్లీ తనలో అసంతృప్తి మొదలైంది. అందుకు కారణం... పవన్! పవన్ అందం తనని ఊహల్లో విహరింపజేస్తోంది. అతని నవ్వు తన గుండెల్లో అలజడులు రేపుతోంది. 'పవన్... ఐ లవ్ యు!' అనుకొంది.

శారద ముఖం కడుక్కుని వచ్చేసరికి రాఘవ కాఫీ ఇద్దరికీ సిద్ధం చేశాడు.

"కాఫీ మీరు చేశారా?"

"అవును. పాపం... పరీక్ష రాసి అలసిపోయి ఉంటావు కదా! అందుకని నేనే చేశాను" అన్నాడు.

కాఫీ త్రాగి "నేను కాసేపు పడుకుంటాను. తలనొప్పిగా ఉంది!" అంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది.

రెండురోజుల తరువాత ఉదయం పాలప్యాకెట్ కోసం వీధిలోకెళ్లి పవన్ ఇంటివైపు చూసింది. పవన్, అతడి భార్య సునంద సూట్‌కేస్‌తో బయటికి రావడం చూసింది. 'బహుశా... పుట్టింటికి వెళుతుందేమో!' అనుకొంది.

అరగంట తర్వాత పవన్ తిరిగొచ్చాడు. బైక్ లోపల పెడుతూ శారద ఇంటివైపు చూశాడు.

అతన్నే చూస్తోంది శారద.

చిన్నగా నవ్వాడు.

తనూ నవ్వి లోపలికి వచ్చేసింది.

పదిన్నర గంటలకు కాలింగ్ బెల్ మ్రోగితే- తలుపు తీసింది శారద.

ఎదురుగా... పవన్!

ఆశ్చర్యంగా అతన్నే చూస్తూండిపోయింది.

"లోపలికి రమ్మనరా ఏమిటి?" అన్నాడు.

ప్రక్కకు తప్పుకుంటూ "రండి..." అంది.

సోఫాలో కూర్చుంటూ "ఏరీ... రాఘవగారు కనబడరే?" అన్నాడు.

"లేకలేక ఇప్పుడే బయల్దేరి లైబ్రరీ కెళ్లారు. ఆదివారం వస్తే చాలు... ఇల్లు కదలరు."

"అదేమిటండీ... అలా అంటారు? నేను ఇంట్లోనే ఉండనని మా ఆవిడ కంప్లైంట్!"

"మీలాంటివాళ్ళు ఉంటే అది వేరే సంగతి!"

విషయం అర్థమైనట్లు చిన్నగా నవ్వాడు.

"మీ ఆవిడ ఊరెళ్లినట్లున్నారు..?!"

"అవునండీ! మీరన్నట్లు నాకు కూడా మా ఆవిడ ఊరికెళ్తే పెద్ద రిలీఫే! లేకపోతే ఎప్పుడూ తన ఎదురుగానే ఉండాలంటుంది. మీలాంటి అందగత్తె వలలో ఎక్కడ పడిపోతానో... అని తన భయం!"

"వల వేస్తే పడిపోయేవారా మీరు?"

"వల గట్టిదైతే తప్పదుగా!"

"మీరు చాలా బాగా మాట్లాడతారు."

"నేను ఒట్టి మాటల మనిషినే కాదండోయ్ః... చేతల మనిషిని కూడా!"

"ఆ విషయం నాకు తెలియదుగా!"

"త్వరలోనే తెలుస్తుంది లెండి!"

"ఉండండి... కాఫీ తెస్తాను!" అంటూ వంటింట్లోకి వెళ్లి కాఫీ చేసి తెచ్చింది.

"అబ్బః... కాఫీ చాలా అందంగా ఉందండి!"

"రుచిగా ఉంది... అనాలి!"

"మీ అందమైన చేతులతో చేశారు కనుక అలా అన్నాను."

"మీకు నా అందాన్ని పొగడ్డం తప్ప వేరే మాటలు రావా?" చిరుకోపంగా అంది.

"ఓ.కే. ఇక మాటలు చాలిస్తాను!" అని మళ్లీ తనే-

"రేపు నేను ఆఫీసుకి లీవు పెడతాను. మనం ముగ్గురం మార్నింగ్ షో సినిమా కెళదామా?" అన్నాడు.

"ఆయన సాధారణంగా ఆఫీసుకి సెలవు పెట్టరు. సినిమాకైతే అసలు పెట్టరు."

"పోనీ... మనిద్దరం వెళదాం!"

"ఎవరైనా చూస్తే..?" భయంగా అంది.

"ఇంత పెద్ద సిటీలో మనల్నెవరు గుర్తుపడతారు? మనం విడివిడిగానే వెళ్దాం. థియేటర్‌లో కలుసుకుందాం."

"ఏ సినిమా కెళదాం?"

సినిమా పేరు, థియేటర్ పేరు చెప్పాడు.

అయితే శారద సినిమాకి వెళ్లలేదు.

ఎవరైనా చూస్తారన్న సంశయం, భర్తకి తెలుస్తుందన్న భయం వల్ల వెళ్లలేకపోయింది. పదకొండు గంటలకు ఫోనొస్తే రిసీవర్ తీసింది.

"హలో... శారదగారా?"

"అవును..."

"సినిమాకు రాలేదేం?"

ఆమె జవాబు చెప్పలేదు.

"అర్థమైంది లెండి. పర్వాలేదు. ఇంకోసారి వెళదాం. బీ రిలాక్స్‌డ్!" అంటూ ఫోను పెట్టేశాడు.

గుండెల మీది బరువు తీసేసినట్లు ఫీలయింది శారద.

• • •

ఆ రోజు రాఘవ- క్యాంప్ ఉందని తెల్లవారిఝామునే వెళ్లిపోయాడు.

ఏమీతోచక ఎనిమిది గంటలకు పవన్ ఇంటి ముందుకెళ్లి కాలింగ్‌బెల్ నొక్కింది.

తలుపు తీసిన పవన్ భార్య సునందను చూసి ఆశ్చర్యపోయింది.

"మీరు... మీరు ఊరి నుంచి ఎప్పుడొచ్చారు?" అనాలోచితంగా అనేసింది.

"నిన్నరాత్రి వచ్చాను. మీరు నాకోసం రాలేదా? మావారి కోసం వచ్చారా?"

"అబ్బే... ఆం... అవును. ఆయన కంపెనీలో డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తున్నారని పేపర్లో చదివాను. ఆ వివరాలు మాట్లాడుదామని!"

"ఆయన బయటికెళ్లారు. రండి... కూర్చోండి! సెలవురోజు కూడా ఇంట్లో ఉండరు ఈయన. క్లబ్బు, ఫ్రెండ్స్... ఇవే ఆయన లోకం! మీ ఆయనలా సెలవురోజు భార్యతో గడపవచ్చనే ఆలోచనే లేదు."

"అవి కూడా అవసరమే లెండి! మగవాళ్ళకు ఇల్లూ, ఆఫీసు తప్ప మరోప్రపంచం లేకపోతే మనకే విసుగొస్తుంది."

"మీరు భలే తమాషాగా మాట్లాడుతారు. ఉండండి... కాఫీ తీసుకొస్తాను."

"వద్దండీ! ఇప్పటికే ఇంట్లో రెండుసార్లు త్రాగాను. మీరు కూర్చోండి. కాసేపు మాట్లాడుకుందాము" అంది శారద.

"మీ జంటను చూస్తే చాలా ముచ్చటేస్తుంది నాకు!" అంది సునంద.

"మీరు తమాషా చేస్తున్నారు!" నొచ్చుకుంటూ అంది శారద.

"ఛ...ఛ... అలా ఎందుకనుకుంటారు? నేను నిజంగా చెప్తున్నాను. మగవాడి అందం రంగులో, రూపురేఖల్లో ఉండదు. అతని క్యారెక్టర్‌లో ఉంటుంది. మీ ఆయన్నే చూడండి... ఆయన ఛాయ కాస్త తక్కువైనా తను ఉన్నంతలో తృప్తిగా ఉన్నట్లు ఆయన ముఖమే చెబుతుంది. మనసు

అందంగా లేకుండా మనిషెంత అందంగా ఉన్నా దగ్గరవాలనిపించదు. ఆ విషయంలో మీరు చాలా అదృష్టవంతులు!"

"నేను మీ ఇద్దరి గురించి అనుకొంటూ ఉంటాను... ఇద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా ఉంటారనీ, మీది అందమైన జంట... అనీ!"

"అందమె ఆనందం' అని ఎవరన్నారో కాని, అది నిజం కాదనిపిస్తుంది నాకు. అందం వల్ల అనవసరమైన ఆలోచనలు, భయాలు తప్ప ఆనందం కనిపించటం లేదు."

"అంటే... మీరు ఆనందంగా లేరా?"

"ఉంటే ఇలా సెలవురోజు ఒంటరిగా కూర్చొని ఉంటానా చెప్పండి?"

"పవన్ మిమ్మల్ని బాగానే చూసుకుంటున్నారుగా..?!"

"పవన్ ఆడవాళ్ళ ఆలోచనలకూ, అభిప్రాయాలకూ చాలా విలువ ఇస్తాడు. సారీ... ఇచ్చినట్లు నటిస్తాడు. ఒకసారి ఆ ఆడది ఇతనికి లొంగిందా- ఇక అంతా తన ఇష్టమే! కనీసం మనిషిగా కూడా గౌరవించదు. అతనితో కాపురం చేసిన ఆడవాళ్ళలో నా నెంబరు మూడు. మా కాపురం ఎన్నిరోజులో నాకే తెలియదు. ఎప్పుడూ క్రొత్త అమ్మాయిల కోసం వేటాడుతూనే ఉంటాడు. క్రొత్త అమ్మాయి దొరికిందంటే నన్ను వదలి వెళ్లిపోతాడు. అప్పుడు నా గతేమిటని ఆలోచిస్తేనే భయమేస్తుంది. మరణమే నా సమస్యకు పరిష్కారం కావొచ్చు."

నోట మాట రానట్టు నిలబడిపోయింది శారద. ఎంత గండం తప్పింది తనకు? ఈరోజు సునందతో మాట్లాడకపోయివుంటే ఏదో ఒకరోజు పవన్ ఉచ్చులో ఇరుక్కుపోయేదే!

"మీరు బాధపడకండి. మరణం అన్ని సమస్యలకు పరిష్కారం కాదు. మీరు ధైర్యంగా ఉండండి..." అంటూ శెలవు తీసుకొంది శారద.

శారద వెళ్లిన వైపే చూస్తూండిపోయింది సునంద...

'తన మాటలు శారదపై బాగానే పనిచేశాయి. ఆమె తన భర్తపై మనసుపడిన సంగతి తను గ్రహించింది. దేవుడిలాంటి రాఘవను ఆమె అన్యాయం చేయటం సహించలేకపోయింది. పవన్‌కి ఆడవాళ్ళ పిచ్చి ఉంది. అందమైన ఆడవాళ్ళను కవ్వించడం, వారి జీవితాలతో ఆటలాడ్డం అతని హాబీ! తన మాటలు విన్నైనా శారద పవన్‌పై ఆకర్షణ తగ్గించుకుంటుంది. మనసులో సంఘర్షణ తగ్గి భర్తను ప్రేమించడం మొదలుపెడుతుంది. అదే తనకు కావాలి. పైగా, పవన్ బారినుండి శారదను కాపాడిన పుణ్యం తనకు దక్కుతుంది' ...అనుకుంది సునంద.

ఆరోజు రాత్రి భర్త ఒడిలో తలపెట్టుకొని అంది శారద-

"మనం వేరే ఇంటికి వెళ్లిపోదామండీ! ఆ పవన్ ప్రవర్తన నాకెందుకో నచ్చటం లేదు. ప్లీజ్... నా మాట వినరూ?!"

ఆమె అన్ని కోరికలూ తీర్చినట్టే ఆ కోరిక కూడా తీర్చాడు రాఘవ. అయితే అతనికి తెలియదు... ఆమె కోరిక తీర్చడం వల్ల సునంద, శారద సమస్యలతో పాటు తనకు తెలియని తన సమస్య కూడా తీరిందని!